క్లుప్తంగా

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడికి సన్మానం



నారాయణపేట రూరల్: బీజేపీ రాష్ట్ర నూతన అధ్యక్షుడు రాంచందర్‌రావును శనివారం పాలమూరు ఎంపీ డీకే అరుణతో కలిసి జిల్లా నాయకులు ఘనంగా సన్మానించారు. రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. లీగల్ సెల్ ఆధ్వర్యంలో న్యాయవాదులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు కే. రతంగపాండురెడ్డి, బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు పగడాకుల శ్రీనివాస్, మాజీ ప్రధాన కార్యదర్శి కే. రఘురామయ్య గౌడ్, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షుడు లక్ష్మి శ్యాంసుందర్ గౌడ్, మైనార్టీ మోర్చా నాయకుడు మహబూబ్‌అలీ, బాల్‌రెడ్డి, నందు నామాజీ పాల్గొన్నారు.

టీఎస్‌పీఆర్టీయూ కార్యవర్గం ఎన్నిక



మక్తల్: మండలం నూతన టీఎస్ పీఆర్టీయూ నూతన కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మక్తల్ మండల అధ్యక్షుడిగా ఏ.గోపాల్‌రెడ్డి, రాష్ట్ర అసోసియేట్ సభ్యులుగా గాయత్రి రమేష్, పి.బాల్‌రాజ్ లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా శాలువాతో సన్మానం చేశారు. సమావేశంలో జిల్లా నాయకులు యాదగిరి, జనార్దన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, తిరుపతి, బాబు, అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

గోరింట సంబరం.. అతివల ఆనందం



నారాయణపేట రూరల్: ఆషాడ మాసాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలో సాయి విజయ కాలనీకి చెందిన మహిళలు శనివారం ఒక చోట చేరారు. ఈ సందర్భంగా గౌరీ దేవి ప్రతిమకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తమ చేతులకు గోరింటాకు పెట్టుకుని సందడి చేశారు. కార్యక్రమంలో అన్నపూర్ణ, గీత, నాగమ్మ, శ్యామల, శ్రావణి, మాధవి, స్వాతి, అనిత, స్వప్న, వైద్యులు, ఉపాధ్యాయులు, రిటైర్డ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

సమయ శ్లోక యంత్రం ప్రారంభం



మద్దూరు: మున్సిపల్ కేంద్రంలోని పాత బస్టాండ్ చౌరస్తాలో ఆంజనేయస్వామి దేవాలయంలో హిందూ బంధువుల ఆధ్వర్యంలో శనివారం ప్రతి గంటకు భగవద్గీత శ్లోకం చెప్పే హిందూ టెంపుల్ బెల్ క్లాక్‌ను ప్రారంభించారు. ఇది ప్రతిగంటకు భగవద్గీతలోని ఒక శ్లోకం చెప్తుంది. ఈ పరికరం ఉదయం 5గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు పని చేస్తుంది. ఉదయం 5 గంటలకు సుప్రభాతంతో అందరికి శుభోదయం చెప్తుంది. ఏ రోజుకు సంబంధించిన భగవంతుని పాటను ఆ రోజుకు మూడు సార్లు పాడుతుంది. కార్యక్రమంలో హిందూ సోదరులు, బంధువులు పాల్గొన్నారు.

వర్షాల కోసం శివలింగం జల దిగ్బంధనం



మరికల్: వారం రోజులుగా ముఖం చాటేసిన వర్షాలు కురవాలని శనివారం చిత్తనూర్ గ్రామంలో శివలింగంను జల దిగ్బంధనం చేశారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని, పడి పంట లు బాగా పండాలని ఆంజనేయస్వామి ఆలయంలో ఉన్న శివలింగానికి పూజారి శ్రీకాంత్ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామస్తులు బిందెలతో శివలింగంను జలదిగ్బంధనం చేసి వర్షాలు కురవాలని వేడుకున్నారు.

కంపెనీల్లో స్థానికులకు చోటేది?

- ఇథనాల్, స్నేహ చికెన్ ఫ్యాక్టరీలతో పాటు పెద్దపెద్ద రైస్ మిల్లులు ఏర్పాటు
- ఆయా కంపెనీల్లో బయటివారికే ఉపాధి
- ఆందోళన చెందుతున్న స్థానిక నిరుద్యోగులు



ఇథనాల్ ఫ్యాక్టరీ, స్నేహ చికెన్ ఫ్యాక్టరీ

కృష్ణా: కృష్ణా మండలం ఓ వరప్రదాయిని అని చెప్పొచ్చు. ఈ మండలానికి రెండు జాతీయ రహదారులు, రైల్వే జంక్షన్, పుష్కలంగా నీరు లభించే కృష్ణా, భీమ జీవనదులు, కర్ణాటక రాష్ట్రం సరిహద్దు కలిగి ఉంది. ఇలా ఏది చూసినా వ్యాపారులకు ఈ మండలం అనుకూలం కావడంతో కొంతకాలంగా ఇక్కడ పలు ఫ్యాక్టరీలు, కంపెనీలు, రైస్ మిల్లులు ఏర్పాటు చేయడం అభినందనీయం. ఇంతటి అభివృద్ధి పొందే అవకాశం ఉన్నప్పటికీ ఈ ప్రాంతంలోని యువతకు, నిరుద్యోగులకు ఉపాధి లేకుండా పోతోంది. కంపెనీలలో, రైస్ మిల్లుల్లో, ఫ్యాక్టరీలలో స్థానికులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడం లేదు. ఇతర ప్రాంతాల వారు ఇక్కడ పని చేస్తున్నారు. దీంతో ఈ ప్రాంత ప్రజలు, నాయకులు, నిరుద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇథనల్, స్నేహ చికెన్ ఫ్యాక్టరీలలో స్థానికులకు అవకాశం కల్పించాలి. మండలంలో ప్రారంభానికి సిద్ధమవుతున్న ఇథనల్, స్నేహ చికెన్ ఫ్యాక్టరీలలో స్థానిక నిరుద్యోగులకు మొదట అవకాశం కల్పించాలని స్థానిక నాయకులు డిమాండ్ చేస్తున్నారు. మండలంలో 7 రైస్‌మిల్లులున్నాయి. ఇందులో 3 రైస్ మిల్లులు అతి పెద్దవి. వాటిలో అవకాశం ఉన్న మేరకు స్థానికులకు ఉపాధి కల్పించాలని గుడెబల్లూర్ మాజీ ఎంపీటీసీ సభ్యుడు కొంకల్ వెంకటేష్, గుడెబల్లూర్ ఎత్తిపోతల అధ్యక్షుడు శివరాజ్‌తో పాటు మండల యువజన సంఘాల నాయకులు, నిరుద్యోగులు డిమాండ్ చేస్తున్నారు.

ఈ ప్రాంతం నిరుద్యోగులకు చిన్నచూపు..

మండంలోని కృష్ణా, గుడెబల్లూర్, హిందుపూర్, కున్సీ తదితర గ్రామాలకు చెందిన అర్హతలున్న యువతీ యువకులు వందల మంది కర్ణాటకలోని శక్తినగర్‌లో పలు ప్రైవేట్ కంపెనీలకు ఉపాధి కోసం ప్రతి నిత్యం వెళ్తుంటారు. కర్ణాటక కంపెనీ వారు, తోటి ఉద్యోగులు తెలంగాణ వారిని చిన్న చూపు చూస్తున్నారు. వారికి స్థానికంగా ఉన్న కంపెనీలలో అవకాశం కల్పిస్తే గర్వంగా ఉంటుంది.

పరిశీలిస్తాం..

మండలంలో ఉన్న ఫ్యాక్టరీలను పరిశీలిస్తాను. ఆ ఫ్యాక్టరీల వల్ల మండలానికి ఎలాంటి ప్రయోజనాలున్నాయి, తదితర అంశాలపై పూర్తి స్థాయిలో పరిశీలించిన తరువాత వివరాలు వెల్లడిస్తాను.
– శ్రీనివాస్, తహసీల్దార్, కృష్ణా

అర్హతలున్నా అవకాశం ఇవ్వడం లేదు..



మా గ్రామ పంచాయతీ పరిధిలో ఇథనాల్ ఫ్యాక్టరీతో పాటు స్నేహ చికెన్ ఫ్యాక్టరీలలో పని చేసేందుకు అవసరమయ్యే అన్ని అర్హతలు మాకు ఉన్నాయి. మేము కర్ణాటకలోని కడెచూర్, శక్తినగర్‌లలోని పలు కంపెనీలలో పనిచేయుటకు వెళ్తున్నాం. మా ప్రాంతంలోని కంపెనీలలో అవకాశం కల్పిస్తే బాగుంటుంది.
– దండు రాజు, బీఎస్సీ, గుడెబల్లూర్

ఫ్యాక్టరీల వల్ల ఉపయోగం లేదు..



మండలంలో ఒక పక్క ఇథనల్, మరో పక్క స్నేహ చికెన్ ఫ్యాక్టరీ లున్నా ఇక్కడి నిరుద్యోగులకు, ప్రజలకు ఎలాంటి ఉపయోగం లేదు. పైగా మా ప్రాంతంలోని ప్రకృతి సంపద వాడుకుంటున్నారు. అందులో పని చేసేందుకు మాత్రం మాకు అవకాశం ఇవ్వడం లేదు.
– సీహెచ్ నర్సింహులు, ఎలక్ట్రీషన్, గుడెబల్లూర్

స్థానికులకు ప్రాధాన్యత ఇవ్వాలి..



మండలంలోని మినీ ఇండస్ట్రీయల్స్, ఇథనాల్, స్నేహ చికెన్ ఫ్యాక్టరీలలో పని చేసేందుకు మొదటి ప్రాధాన్యత స్థానికులకు ఇవ్వాలి. అందుకోసం స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు కృషి చేయాలి. తద్వారా మండలంలోని నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడుతాయి.
– కాశీనాథ్, ఐటీఐ ఎలక్ట్రీషన్, గుడెబల్లూర్

42శాతం రిజర్వేషన్లపై హర్షం



మాట్లాడుతున్న వేణుగోపాల్

కోస్గిరూరల్: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుకు మంత్రి వర్గ ఆమోదం పొందడం సంతోషదాయకమని సింగిల్‌విండో వైస్ చైర్మన్ వేణుగోపాల్, బీసీ సంఘం అధ్యక్షుడు బస్వరాజ్ అన్నారు. శనివారం విలేకరులతో మాట్లాడారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించడం హర్షనీయమన్నారు. మంత్రివర్గం ఆమోదించిన ఆర్డినెన్స్‌కు చట్టబద్ధత కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. అన్ని రాజకీయ పార్టీలు చిత్తశుద్ధితో ఏకాభిప్రాయానికి వచ్చి చట్టం తీసుకురావాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో బాలకృష్ణగౌడ్, చంద్రమౌళి, కాశప్ప, కనకప్ప ఉన్నారు.

మరికల్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవడం పట్ల ముదిరాజ్ సంఘం మండల నాయకులు రామకృష్ణ, సత్యన్న, ఆంజనేయులు సంయుక్త ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. బీసీల అభ్యున్నతికి పటుపడుతున్న సీఎం రేవంత్ రెడ్డి తీసుకున్న నిర్ణయం హర్షించదగ్గదన్నారు. అన్ని రాజకీయ పార్టీలు బీసీలకు న్యాయం జరిగేలా 42 శాతం రిజర్వేషన్‌కు ఆమోదం తెలుపాలన్నారు.

దసరా ఉత్సవాలకు రూ.లక్ష విరాళం



దసరాకు విరాళం అందజేస్తున్న దాతలు

మరికల్: మండల కేంద్రంలోని కుర్వగేరి శివాలయంలో ప్రతి ఏడాది నిర్వహించే దసరా ఉత్సవాలకు ఇద్దరు వ్యక్తులు రూ. లక్ష విరాళం అందజేశారు. శనివారం ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బెలగొంది వీరన్న రూ.50 వేలు, అడ్వకేట్ అయ్యప్ప రూ.50 వేలు వీరశైవ సమాజం అధ్యక్షుడు జగదీశ్వర్‌కు అందజేశారు. దాతలు అందజేసిన విరాళాలను ప్రతి ఏడాది నిర్వహించే దేవిశరన్నరాత్రి ఉత్సవాలకు ఉపయోగిస్తామని అధ్యక్షుడు తెలిపారు. దసరా వేడుకలు మరో రెండు నెలలు ఉండగానే విరాళం ఇవ్వడం వారి సేవలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో బస్వరాజ్, తిప్పయ్య, ప్రసాద్, విశ్వేశ్వర్‌లు పాల్గొన్నారు.

ఎండిన చెట్టుతో ముప్పు



మాగనూర్: మండలంలోని ఓబ్లాపూర్ గేట్ సమీపంలో జాతీయ రహదారి పక్కన ఎండిపోయిన చెట్టు ప్రమాదకరగా ఉంది. కొద్ది రోజులుగా రోడ్డు పక్కనే కూలేందుకు సిద్ధంగా ఉన్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారని ప్రజలు పేర్కొంటున్నారు. ప్రధాన జాతీయ రహదారి కావడంతో నిత్యం ప్రయాణికులు పదుల సంఖ్యలో ప్రయాణిస్తుంటారు. ఎండిన చెట్టు ఎప్పుడు కూలుతుందో అన్న భయంతో బిక్కుబిక్కుమంటూ ప్రయాణం సాగిస్తున్నారు. ప్రమాదం చోటు చేసుకోక ముందే సంబంధిత అధికారులు స్పందించి చెట్టును తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

కల్వర్టుకు మరమ్మతు చేసిన సిబ్బంది



మరమ్మతు చేస్తున్న పంచాయతీ సిబ్బంది

ధన్వాడ: కొంత కాలంగా కూలిపోయిన కల్వర్టుకు ఎట్టకేలకు పంచాయతీ అధికారులు మరమ్మతు చేశారు. మండల కేంద్రంలో కంసాన్‌పల్లి గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిలో మారుతినగర్ వద్ద సింపునోనికా ల్వపై ఉన్న కల్వర్టు గత నెల కూలిపోయింది. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. దీనిపై వివిధ రాజకీయ పార్టీల నాయకులు నిరసన వ్యక్తం చేస్తూ పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఎట్టకేలకు శనివారం పంచాయతీ అధికారులు మరమ్మతు పనులు పూర్తి చేశారు. దీంతో గ్రామస్తులు, వాహనదారులు హర్షం వ్యక్తం చేశారు.

అమచింతలో దొంగల హల్‌చల్

అమరచింత: పట్టణంలో శుక్రవారం రాత్రి గుర్తు తెలియని దొంగలు హల్‌చల్ చేశారు. బస్టాండ్‌లో ఉన్న షిరిడిసాయి కాంప్లెక్స్‌లో ఉన్న రెండు మొబైల్ షాపులు, జిరాక్స్‌సెంటర్ షెట్టర్ ధ్వంసం చేశారు. వివరాల్లోకి వెళితే షిరిడిసాయి కాంప్లెక్స్‌లోని వెంకటేశ్వర మొబైల్‌షాపు తాళాలు పగులకొట్టి వాటిలోని రూ.50వేల విలువైన సెల్‌ఫోన్‌తో పాటు ల్యాబ్‌టాప్‌ను ధ్వంసం చేశారు. అదేవిధంగా జ్యూస్ సెంటర్‌లోని కౌంటర్‌లో ఉన్న రూ.వెయ్యి చోరీ చేశారు. ఎస్ఎల్ఎన్ మొబైల్ షాపు, విపణి జిరాక్స్ సెంటర్ల షట్టర్ల తాళాలను బండరాళ్లతో బాదిన పగలకపోవడంతో వెనక్కి వెళ్లారు. దీంతో ఆయాషాపుల యజమానులు ఉప్పరి వెంకటేష్‌తో పాటు పలువురు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పట్టణంలో సీసీ కెమెరాల ఏర్పాటు కోసం వివరాలు తీసుకున్న నేటికీ సీసీ కెమెరాలను ఏర్పాటు చేయక పోవడంతో రాత్రి వేలలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీలకు పాల్పడుతున్నారని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలపై దృష్టి పెట్టండి



కొత్తపల్లి: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో యువత ఎక్కువ సంఖ్యలో పాల్గొనేలా చూడాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. శనివారం నియోజకవర్గంలో యూత్ కాంగ్రెస్ నాయకులతో హైదరాబాద్‌లోని సీఎం నివాసంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో యువత పాత్ర ఎంతైనా ఉందని, రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. రాబోయే ఎన్నికల్లో యువకులు ప్రత్యక్ష రాజకీయాల్లో పాల్గొని పోటీ చేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రజల్లో చైతన్యం తీసుకరావాలని అన్నారు. కొత్తపల్లి, గుండుమాల్‌లో కొనసాగుతున్న అభివృద్ధి పనులపై ఆరా తీసినట్లు ఉమ్మడి మద్దూరు మండల యూత్ కాంగ్రెస్ నాయకులు నరేశ్ యాదవ్ తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రెడ్డి శ్రీను పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కృషి

కోస్గి రూరల్: నియోజకవర్గంలోని అన్ని గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పని చేయాలని సీఎం ఆదేశించారని నారాయణపేట జిల్లా యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు మోహన్, నియోజకవర్గ అధ్యక్షుడు రెడ్డి శ్రీను అన్నారు. శనివారం హైదరాబాద్‌లోని సీఎం నివాసంలో కలిశారు. నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై చర్చించినట్లు తెలిపారు. కార్యక్రమంలో శరణ్, రాజగోపాల్, షఫీ, రమేష్‌నాయక్, నరేష్ యాదవ్, విజయ్, మహిపాల్, అశోక్, శ్రీను ఉన్నారు.

భక్తులతో కిక్కిరిసిన ఆదిశిలా క్షేత్రం

మల్దకల్: ఆదిశిలా క్షేత్రం స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయం శనివారం భక్తులతో కిక్కిరిసింది. ఈ సందర్భంగా అర్చకులు మధుసూదనాచారి, రమేషాచారి, రవిచారి స్వామికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. భక్తులు స్వామివారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అదే విధంగా సద్దలోనిపల్లి కృష్ణస్వామి, పాల్వాయి అడవి ఆంజనేయస్వామి, కుర్తిరావులచెర్వు గట్టు తిమ్మప్ప స్వామి ఆలయాల్లో పూజలు చేశారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు అరవిందరావు, చంద్రశేఖర్‌రావు, వాల్మీకి పూజారులు తిమ్మప్ప, నర్సింహులు, ఆలయ సిబ్బంది ఉరుకుందు, కృష్ణ, శివమ్మ, రాము, శ్రీను, చక్రి పాల్గొన్నారు.

డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ద్వారా నర్సింగ్ అసిస్టెంట్ కోర్సులో మహిళలకు ఉచిత శిక్షణతోపాటు వసతి సౌకర్యం కల్పిస్తున్నామని ఎనుగొండలోని హైక్వాలిటీ హెల్త్‌కేర్ స్కిల్లింగ్ సెంటర్ మేనేజర్ సాయివినిత తెలిపారు. ఈ కోర్సు పూర్తి చేసిన వారికి శనివారం సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ కోర్సు పూర్తి చేసిన వారికి ప్రైవేట్ హాస్పిటల్స్‌లో ఆన్-జాబ్ ట్రైనింగ్, సాఫ్ట్ స్కిల్స్ శిక్షణ ఇప్పిస్తామన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి



గాయత్రి నగర్ మొక్కలు నాటి నీళ్లు పోస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

నారాయణపేట రూరల్: ప్రతి ఒక్కరు తమ ఇంటి పరిసరాలలో విధిగా మొక్కలు నాటి సంరక్షించాలని తపస్ జిల్లా అధ్యక్షుడు షేర్ కృష్ణారెడ్డి అన్నారు. తన కూతురు హారిక జన్మదినం సందర్భంగా సొంత డబ్బులతో మొక్కలు తెచ్చి వివిధ ప్రభుత్వ పాఠశాలలు, పట్టణంలోని కాలనీలకు ఉచితంగా అందించారు. శనివారం పట్టణంలోని తాయమ్మ గుడి, గాయత్రి నగర్ కాలనీ, హనుమాన్ సాయి కాలనీ అంతర్గత రహదారుల పక్కన తన భార్య పారిజాతతో కలిసి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మొక్కలు నాటి నీళ్లు పోశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుట్టినరోజు వేడుకల పేరుతో డబ్బులు వృథా చేయకుండా సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. ఏటా తమ పిల్లల బర్త్ డే లకు 20 ఏళ్లుగా మొక్కలు అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో దేవేందర్ రెడ్డి, కృపాకర్ రెడ్డి, రాంరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, గందె రవికాంత్, కానుకుర్తి జీహెచ్ఎం అన్నపూర్ణ, వైద్యులు గీత, విశ్వనాథ్, రిటైర్డ్ టీచర్లు నాగమ్మ, పంపయ్య, వెంకట్రామ రెడ్డి, అడ్వకేట్ శివరాజ్, ప్రభాకర్ రెడ్డి, రవి, శివ, ఆనంద్, సురేష్, శ్యామల, శ్రావణి, స్వప్న, స్వాతి, మాధవి, అనిత పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీ



కొత్తపల్లిలో ఎరువుల దుకాణం తనిఖీ చేస్తున్న వ్యవసాయాధికారి రామకృష్ణ

కొత్తపల్లి: రైతులకు అందిస్తున్న ఎరువుల వివరాలను శనివారం ఉమ్మడి మద్దూరు మండల వ్యవసాయ అధికారి రామకృష్ణ మండలంలోని ఎరువుల దుకాణాలను ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. రైతులు కొనుగోలు చేసే ఎరువులకు బిల్లును తప్పకుండా ఇవ్వాలని సూచించారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తే చట్ట పరంగా చర్యలు తీసుకుంటామని షాపు డీలర్లను హెచ్చరించారు. రైతులు కొనుగోలు చేసే ప్రతి వస్తువు స్టాక్ రిజిస్టర్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. వరి నారుమల్లలో యూరియా వాడకం తగ్గించాలని తెలిపారు. విత్తన బ్యాగులపై ఎక్స్‌పైర్ తేదీలను చూసుకొని విక్రయించాలని, ప్రభుత్వం నిర్ణయించిన ధరలను నోటీసు బోర్డుపై రాసి ఉంచాలని సూచించారు.

స్థానిక ఎన్నికల తుది జాబితా విడుదల



ఎంపీటీసీ, జెడ్పీటీసీ తుది జాబితాను విడుదల చేస్తున్న ఎంపీడీఓ నర్సింహారెడ్డి

మద్దూరు: ఉమ్మడి మద్దూరు మండలంలోని ఎంపీటీసీ జెడ్పీటీసీ స్థానాల తుది జాబితాను శనివారం మద్దూరు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎంపీడీఓ నర్సింహారెడ్డి విడుదల చేశారు. మద్దూరు మున్సిపాలిటీగా ఏర్పడటంతో మిగిలిన పరిసర గ్రామాలకు సంబంధించిన 10 ఎంపీటీసీలు, ఒక జెడ్పీటీసీ స్థానానికి తుది జాబితాను విడుదల చేశారు. కొన్ని రోజులుగా అభ్యంతరాల స్వీకరణ ప్రకటనను విడుదల చేశారు. గ్రామాల్లోని అన్ని పార్టీల నాయకులతో సమావేశం ఏర్పాటు చేసి తుది జాబితాను జిల్లా అధికారులకు పంపించగా, శనివారం తుది జాబితాను విడుదల చేశారు.

నీటికోసం రైతుల ఎదురుచూపు



మండలంలో నీరులేక వట్టిపోయిన కాలువ

మాగనూర్: వానాకాలం వరిసాగు చేస్తున్న రైతులు కాలువ నీటి కోసం సంగంబండ కుడి లోలెవల్ కెనాల్ సాగునీరు కోసం ఎదురు చూస్తున్నారు. సంగంబండ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో పుష్కలంగా నీరు ఉన్నా ప్రస్తుతం సాగు చేస్తున్న రైతులకు మాత్రం కాలువ నీరు అందడం లేదు. క్షేత్రస్థాయిలో చూస్తే ఇప్పటికే కొందరు కెనాల్ కింద వరిసాగు చేసుకోగా, మరికొందరు రైతులు వరినారు సిద్ధంగా ఉంచుకుని నాటుకు సిద్ధంగా ఉన్నారు. పంటలు కోతలు అయిపోయిన సమయంలో నీటిని వృథాగా వదిలేసి ఇప్పుడు రైతులు వరినాట్లు మొదలుపెట్టిన సమయంలో నీటి సరఫరా నిలిపేయడం ఏమిటని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులు త్వరతగతిన కాలువకు నీరు వదలాలని కోరుతున్నారు. ప్రస్తుతం వరి నాట్లు జోరుగా సాగుతున్న సమయంలో కాలువలో నీరు రాకపోవడంతో తీవ్రంగా ఇబ్బందులకు గురవుతున్నట్లు రైతులు పేర్కొన్నారు. అధికారులు స్పందించి చివరి ఆయకట్టుకు చేరే విధంగా నీటిని కాలువల ద్వారా విడుదల చేయాలని కోరుతున్నారు.

ఏకగ్రీవ పంచాయతీల్లో నిరాశే!

- రూ.10లక్షలతో ప్రోత్సాహక నిధులేవీ..
- పల్లెల్లో సర్పంచ్ ఎన్నికల కోలాహలం
- గెలుపుకోసం ఆశావహుల గ్రూపుమీటింగ్‌లు
- మండలంలో మొత్తం 23,279మంది ఓటర్లు
- అభివృద్ధికి నోచుకోని తండాలు



కొర్లకుంట పంచాయతీ భవనం

వీపనగండ్ల: మండలంలోని పలు గ్రామాల్లో స్థానిక సంస్థలకు త్వరలోనే ఎన్నికలు జరగనున్నాయన్న సంకేతాలు రావడంతో ఎన్నికల్లో ఆశావహులు పల్లెల్లో గ్రూపు సమావేశాలకు తెరలేపారు. రిజర్వేషన్లు ఖరారైతే నేరుగా ఓటర్లను కలుసుకోవాలన్న ఆలోచనలో ఉన్నారు. గత పంచాయతీ ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎంపికైన పంచాయతీ ప్రతినిధులకు రూ.10లక్షల ప్రోత్సాహాన్ని అందజేస్తామని ఆనాటి ప్రభుత్వం ప్రకటించి ఒక్క పైసా కూడా విడుదల చెయ్యకపోవడంతో ఏకగ్రీవ పంచాయతీలలో ప్రజలు తీవ్ర నిరాశకు గురయ్యారు. ఈ దఫా జరిగే ఎన్నికల్లో అయిన ఏకగ్రీవ పంచాయతీలకు ప్రోత్సాహకాలు ప్రకటించి వెంటనే ఆ నిధులను మంజూరు చేస్తే గ్రామాలు అభివృద్ధి పథంలోకి వస్తాయని ప్రజలు భావిస్తున్నారు.

ఏకగ్రీవ పంచాయతీలకు నిధుల్లేవు..

మండలంలో కొర్లకుంట గ్రామ పంచాయతీలో 8 వార్డులతో సహా సర్పంచ్ కూడా ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. సంపత్‌రావుపల్లి గ్రామంలో ఆరుగురు వార్డు సభ్యులు, పుల్గర్‌చర్లలో ఇద్దరు, కల్వరాల్లలో ఒకరు, నాగర్లబండ తండా ఒక వార్డు ఏకగ్రీవంగా ఎంపిక కాగా కొర్లకుంటకు రావాల్సిన రూ.10లక్షల పారితోషికం డబ్బుల్లో పైసా కూడా విడుదల చెయ్యలేదు.

పల్లెల్లో 'పంచాయతీ' కోలాహలం

మండలంలోని 14 గ్రామ పంచాయతీలు, 8 ఎంపీటీసీ స్థానాలకు త్వరలో ఎన్నికలు జరుగనున్నాయన్న సంకేతాలతో గ్రామాల్లో ఎన్నికల సందడి నెలకొంది. గ్రూప్ రాజకీయాలు, విందు భోజనాలకు పలు పార్టీల నాయకులు అప్పుడే శ్రీకారం చుట్టారు. మండలంలో మొత్తం 23,279 మంది ఓటర్లు ఉండగా అందులో 11,728 పురుషులు, 11,550 మంది స్త్రీలు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.

నూతన పంచాయతీల్లో ఒరిగింది శూన్యం

చిన్న గ్రామాలను నూతన పంచాయతీలుగా ఏర్పాటు చేసి వాటిని అభివృద్ధి పథంలోకి తెస్తామని ఆర్భాటంగా ప్రకటించి రంగవరం, నాగర్లబండతండా, వల్లాభాపురం తండాలను నూతన పంచాయతీలుగా ప్రకటించారు. అందులో రంగవరం, నాగర్లబండతండాకు నేటికీ ఎలాంటి అభివృద్ధి జరగక పోవడంతో ప్రజలు కూడా నిరాశకు గురవుతున్నారు.

ఏకగ్రీవమైన నిరాశే మిగిలింది



మా గ్రామ ప్రజలు ఏకగ్రీవంగా సర్పంచ్‌గా ఎన్నుకున్నా ప్రభుత్వం ఇస్తానన్న నిధులు రాక పోవడంతో ప్రజల్లో తీవ్ర నిరాశ మిగిలింది.
– నారాయణ, మాజీ సర్పంచ్ కొర్లకుంట

నిధులొస్తే ఏకగ్రీవాలు పెరుగుతాయి



గ్రామాల్లో ఎన్నికల సమయంలో రూ.లక్షలా ది ఖర్చు కాకుండా ఉండాలంటే ఏకగ్రీవంగా ఎంపికయ్యే ప్రజాప్రతినిధులను ప్రోత్సాహించాలి. గ్రామాల అభివృద్ధికి అవసరమైన నిధులను వెంటనే విడుదల చేస్తే ఏకగ్రీవాల సంఖ్య పెరుగుతుంది.
– వెంకటేష్, మాజీ వార్డు సభ్యుడు సంపత్‌రావుపల్లి

ప్రభుత్వం నుంచి నిధులు రాలేదు



ఏకగ్రీవంగా ఎంపికైన గ్రామాలకు ప్రభుత్వం ప్రకటించిన విధంగా ప్రోత్సాహక నిధులు రాలేదు. మండలంలోని పలు గ్రామాల్లో పలువురు వార్డు సభ్యులు కూడా ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. సర్పంచ్, వార్డు సభ్యుల వివరాలను కూడా ఉన్నతాధికారులకు అందజేశాం.
– శ్రీనివాసారావు, ఎంపీడీఓ వీపనగండ్ల